క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా నమో నారసింహ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మొక్కులు ఉన్న కాపులు తలనీలాలు సమర్పించారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

ధర్మవరం అర్బన్: పట్టణంలో నిర్వహించిన జవహర నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్ష సజావుగా జరిగాయని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సంజయ్‌నగర్‌లోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలల్లో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాలను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 240 మందికిగాను 189 మంది, బీఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 163 మందికిగాను 117 మంది పరీక్ష రాశారన్నారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 403 మందికి 97 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష చీఫ్‌లు శైలజ, రాంప్రసాద్, సీఎల్‌ఓలు నర్సింగ్‌రాజు, అనంత పద్మనాభం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన చిగిచెర్ల విద్యార్థులు

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత నెల 27 నుంచి 29 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఎంపిక పోటీల్లో జయశ్రీ 36 కేజీల విభాగం,గే కావ్యశ్రీ 57 కేజీల విభాగం, యశస్విని 52 కేజీల విభాగం, యశ్వంత్ 40 కేజీల విభాగం, విక్రాంత్ 45 కేజీల విభాగం, అఫ్జల్ మెహరాజ్ 50 కేజీల విభాగంలోను బంగారు పతకాలను సాధించారన్నారు. ఈనెల 18 నుంచి 21వరకు మహారాష్ట్రలోని పూణేలో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలో వీరు పాల్గొంటారన్నారు. క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం తిమ్మారెడ్డి అభినందించారు.


ధర్మవరం కళాకారులకు అవార్డులు



అవార్డులు అందుకున్న కళాకారులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం నాట్య కళాకారులకు అవార్డులు దక్కాయి. హైదరాబాద్ రవీంద్రభారతిలో శుక్రవారం నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ధర్మవరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజి, కమల బాలాజి శిష్య బృందం నాట్య ప్రదర్శన చేశారు. నాట్య గురువు కుమార్తెలు హర్షశ్రీ, రామలాలిత్యలు నాట్య రాజ హంస అవార్డులు అందుకున్నారు. శిష్య బృందంలో 20 మందికి నాట్య మయూరి అవార్డులు, 8 మందికి స్వర్ణ నంది అవార్డులు దక్కాయి. నిర్వాహకులు వీరేష్ యాదవ్, ప్రముఖ విద్వాంసులు దైవజ్ఞ శర్మ చేతులమీదుగా అవార్డులు అందుకున్నట్లు నాట్య గురువు బాబు బాలాజి తెలిపారు.

చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి-2011పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి-2011 సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. వయోవృద్ధులకు మెరుగైన వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

మామిడి పూత.. తప్పని వ్యథ!

- నేలలో తగ్గని తేమ శాతం
- మామిడి పూత కోసం రైతుల అష్టకష్టాలు
- ఎకరాకు రూ.30 వేల దాకా అదనపు ఖర్చు

ధర్మవరం రూరల్: మామిడిలో పూత రాకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఏటా సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో మామిడి పూత వస్తుంది. అయితే ఇప్పటి వరకు పూత పూర్తి స్థాయిలో రాకపోవడంతో మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో గత ఐదేళ్ల నుంచి విస్తారంగా మామిడి తోటలను సాగు చేశారు. దాదాపు 6500 ఎకరాల్లో సాగైనట్లు అధికారులు అంచనా.

వాతావరణ మార్పులే కారణం..

వాతావరణంలో మార్పులు మామిడి రైతులకు శాపంగా మారుతోంది. ఇటీవల తుపాన్ కారణంగా కురిసిన వర్షాలతో భూమిలో తేమ శాతం ఉంది. ఫలితంగా మామిడి చెట్లకు పూత రావడంలో ఆలస్యమవుతోంది. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో పూతలు వస్తే ఫిబ్రవరి, మార్చి నెలల్లో పిందెలు వస్తాయి. కానీ పూతలు రాకపోవడంతో ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.40వేల వరకు మందుల పిచికారీ కోసం ఖర్చు చేస్తున్నారు. మార్చిలో మామిడి కోతకు వస్తే మార్కెట్‌లో మంచి ధర ఉంటుంది. అదే ఏప్రిల్, మేలో కోతకు వస్తే ఆ సమయంలో వాతావరణంలో మార్పులు, ఈదురు గాలులు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో పంట చేతి కొచ్చే సమయంలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.



కుణుతూరు వద్ద మామిడి తోటలో పూత కోసం మందు పిచికారీ చేస్తున్న రైతు

ధర్మవరం డివిజన్‌లో మామిడి సాగు(ఎకరాల్లో)

మండలం	సాగు విస్తీర్ణం
ధర్మవరం	1,045
బత్తలపల్లి	305
తాడిమర్రి	458
ముదిగుబ్బ	2,525
కనగానపల్లి	948
చెన్నేకొత్తపల్లి	830
రామగిరి	395

భూమిలో ఇంకా తేమ ఆరలేదు

సాధారణంగా భూమిలో తేమ వుంటే మామిడి తోటల్లో పూతలు రావు. ఇటీవల తుపాను కారణంగా ఇంకా భూమిలో తేమ ఆరలేదు. దీంతో ఈ ఏడాది మామిడిలో పూత ఆలస్యమవుతోంది. ఇప్పటికే తోటల్లో సస్య రక్షణ చర్యల్లో భాగంగా పలుసార్లు మందులను పిచికారీ చేశాం.

రమేష్, మామిడి రైతు, ఏలుకుంట్ల

ఏటా పూత ఆలస్యం

వాతావరణంలో మార్పులు కారణంగా ఏటా పూత ఆలస్యంగా వస్తోంది. ముందస్తుగా తోటల్లో కాపులు వస్తే మార్కెట్‌లో మంచి ధరలు దక్కుతాయి. మంచి దిగుబడుల కోసం అధికారుల సలహాలను తీసుకుంటున్నాం. అధికారులు కూడా తోటల వద్దకు వచ్చి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు.

– చంద్రశేఖర్, మామిడి రైతు, ధర్మవరం

సస్య రక్షణతోనే మంచి దిగుబడులు



మామిడి తోటల్లో అక్కడక్కడ పూతలు వస్తున్నాయి. పూ మొగ్గ, మొగ్గ, పిందె దశ ఎంతో కీలకం. ఈ దశల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే మామిడి రైతులకు అవగాహన కల్పించాం. రైతులకు ఎటువంటి సందేహాలున్నా ఉద్యాన సిబ్బందిని సంప్రదించవచ్చు.

– అమరేశ్వరి,ఉద్యానశాఖ అధికారిణి, ధర్మవరం

కందిలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

బత్తలపల్లి: రాఘవంపల్లిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటలో శనివారం పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 56-2సి రైతు కాటమయ్య కంది పొలంలో నిర్ధీత విస్తీర్ణంలో పంటకోత ప్రయోగాలను ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో వీహెచ్‌ఏ సత్యనారాయణ నిర్వహించారు. ప్రయోగాలను బీమా కంపెనీ కోఆర్డినేటర్లు మంజునాథ్ పర్యవేక్షించారు.

కేసు నమోదు

కదిరి టౌన్: దాడి ఘటనలో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వివరాలు.. రాజీవ్‌నగర్‌కు చెందిన ఆదినారాయణ కుమార్తె జయశ్రీని బేరిపల్లి కాలనీకి చెందిన పూజారి శ్రీనివాసులు ప్రేమించి పెళ్లి చూసుకున్నాడు. శనివారం శ్రీనివాసులు అత్తగారింటిలో ఉన్న తన భార్య దుస్తులు తెచ్చేందుకు వెళ్లాడు. ఈసందర్భంగా అత్త లలితకుమారి, బావమరిది గణేష్ జయశ్రీని సరిగా చూసుకోవడం లేదంటూ శ్రీనివాసులు తలపై చెక్కమొద్దుతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పుట్టపర్తి టౌన్: స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలి ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ చైర్మన్ తంగా ఓబుళపతి, కమిషనర్ ప్రహ్లాద పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వరకూ ర్యాలీ చేపట్టారు. చీపుర్లు పట్టిప్రధాన రహదారిని శుభ్రం చేశారు.

కదిరి టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ కిరణ్‌కుమార్ ప్రజలకు సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిట్టా నరసమ్మ, కార్యదర్శి యల్లప్ప ప్రొక్లెయిన్‌తో పిచ్చి మొక్కలు తొలగించారు. గ్రామ పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని గ్రామస్తులతో అధికారులు ప్రమాణం చేయించారు.

ముదిగుబ్బ: స్థానిక పీహెచ్‌సీ వద్ద శనివారం డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు. సీహెచ్‌ఓ సరస్వతమ్మ, సూపర్‌వైజర్లు విజయకుమారి, భాస్కర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

తనకల్లు: వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి కృష్ణమూర్తి రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి, కదిరి కుంట్లపల్లి గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచులు రజనీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్‌నాయుడు, రామ్మోహన్ పాల్గొన్నారు.



పుట్టపర్తిలో ప్రధాన రహదారిని శుభ్రం చేస్తున్న ఆర్డీఓ సువర్ణ, చైర్మన్ ఓబుళపతి

ఎన్‌పీకుంట: మండల వ్యాప్తంగా శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఆంజినమ్మ, ఏఓ లోకేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

గాండ్లపెంట: మలమీదపల్లిలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఈఓఆర్డీ సునిత, కార్యదర్శి వసుంధర గ్రామసర్పంచ్ కళావతి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో పరిసరాలు శుభ్రం చేశారు.

నల్లమాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ రంగనాయకులు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ, వెలుగు కార్యాలయాల చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించారు. స్వచ్ఛతకు సంబంధించి ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈఓఆర్డీ అమర్నాథరెడ్డి, ఏపీఎం గోపాల్, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీఓ అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రం కనగానపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంకె రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, సర్పంచ్ పంచ రత్నమ్మ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ కాలనీలోని రోడ్డు పక్కన ఉన్న చెత్తచెదారాన్ని తొలగించారు. ఈఓఆర్డీ శకుంతల, స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వర, పంచాయితీ కార్యదర్శులు నరేష్, కిశోర్‌బాబు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్ కుమార్‌నాయక్‌తో పాటు గ్రామ సర్పంచ్ ధనుశ్రీ, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులు రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేశారు.

ఓడీచెరువు: స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనంతాచారి, అధికారులు పాల్గొన్నారు.

రామగిరి: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎమ్మెల్యే పరిటాల సునీత చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు.

తలుపుల : స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం స్థానిక వ్యవసాయ గోడౌన్ వద్ద చెత్త తొలగించారు. అంతకుముందు ఎంపీడీఓ రామానాయక్, వైద్యాధికారి అష్రాఫ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ చేపట్టారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ధర్మవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు విమర్శించారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం సీఐటీయూ, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాల అమల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానం కాకుండా 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తున్నారన్నారు. కనీస వేతనం అమలు చేయడం లేదనిని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనం అమలు చేసే విధంగా ఐక్య ఉద్యమాల ద్వారా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, పట్టణ కార్యదర్శి జయచంద్ర, దస్తగిరి, శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సరస్వతి, ప్రభుత్వ పాఠశాల ఆయాల యూనియన్ నాయకులు నాగవేణి, జయమ్మ, అంగన్‌వాడీ లీడర్లు పోతక్క, దీన, ఫాతిమా, చింతమ్మ, మాంచాలదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి

ప్రయాణికులకు వసతులు కల్పించండి

ధర్మవరం: ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని రైల్వే వినియోగదారుల సలహా సంఘం సభ్యులు కాశీవిశ్వనాథ్, కోటి వెంకటేష్ అధికారులను కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ కార్యాలయంలో శనివారం రైల్వే వినియోగదారుల సలహా సంఘం సమావేశాన్ని స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సలహా సంఘం సభ్యులు మాట్లాడుతూ అన్ని ప్లాట్‌ఫారంలలో తాగునీటి సదుపాయం కల్పించాలని, లిఫ్ట్, ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలన్నారు. కదిరి తిరుపతికి వెళ్లే నాలుగు, ఐదు ప్లాట్‌ఫారం లైన్‌లో బుకింగ్ కౌంటర్‌గాని, ఏటీఎం ఏజెంటు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్‌కు కదిరి వైపు నుంచి 2వ అప్రోచ్ రోడ్డులోని చెట్లు పొదలు తొలగింపు, రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటుతో పాటు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్టేషన్ ఆవరణలో ఏటీఎం, పబ్లిక్ టాయిలెట్లని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలను రైల్వే ఉన్నతాధికారులకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని సలహా సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానారాయణ, ముఖ్య ఆరోగ్య పర్యవేక్షకుడు దామోదర మూర్తి, ఎలక్ట్రికల్ ఇంజినీర్ కిరణ్‌కుమార్, రైల్వే ఏఎస్‌ఐ యాదయ్య, వర్క్ ఇంజినీర్ ఉమేష్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న రైల్వే వినియోగదారుల సలహా సంఘం సభ్యులు

ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

తాడిమర్రి: మండలవ్యాప్తంగా సోమవారం నుంచి చేపట్టనున్న ఇంటింటా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారులు గోవర్ధన్ నాయుడు అధ్యక్షతన ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు కుష్ఠువ్యాధిపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. సోమవారం నుంచి గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ కుష్టు బాధితులను గుర్తించాలన్నారు. వ్యాధి ఉన్నట్లు ఎవరినైనా గుర్తిస్తే వారిని ఆసుపత్రికి తీసుకుని వచ్చి వైద్య చికిత్స అందించేలా కృషి చేయాలన్నారు. వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సక్రమంగా మందులు వాడితే పూర్తిగా వ్యాధి నయం అవుతుందనే విషయాన్ని తెలియజేయాలన్నారు. అనంతరం ఆమె మోదుగులకుంట గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీహెచ్‌ఈఓ నారాయణమ్మ, సూపర్‌వైజర్ రామ్‌కుమార్, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా

బీసీ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయాలి

కదిరి టౌన్: బీసీ సంక్షేమ వసతిగృహాల వార్డెన్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఆ శాఖ డీడీ నిర్మలా జ్యోతిని సస్పెండ్ చేయాలని ఎఐఎస్‌బీ ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి పల్లి పృథ్వి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యూనియన్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

ఓడీచెరువు: అసాంఘిక కార్యకలాపాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఎస్పీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ నరేంద్ర రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి ఉన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు

ముదిగుబ్బ: ముక్తాపురంలో శనివారం గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మల్లికార్జున వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడిగా గోపినాయక్, ఉపాధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నారు.

ధర్మవరం రూరల్: చింతలపల్లి, వసంతపురంలో శనివారం గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలను అధికారులు సజావుగా నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ స్వర్ణలత వ్యవహరించారు. అధ్యక్షుడిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా మునెప్ప ఎన్నికయ్యారు.

తిమ్మమ్మమర్రిమాను వద్ద సౌకర్యాలు కల్పించాలి

ఎన్‌పీకుంట: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మమర్రిమాను వద్ద పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లి) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్ర పంచాయతీ పరిషత్ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. శనివారం ఆయన తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. తిమ్మమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిమ్మమ్మమర్రిమాను సందర్శనకు అధిక సంఖ్యలో పర్యాటకులు, భక్తులు వస్తుంటారన్నారు. ఇందుకనుగుణంగా ఇక్కడ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మర్రిమానును జాతీయ స్మారకంగా, ప్రపంచ పర్యాటక కేంద్రంగా గుర్తించాలని ఇటీవల కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌కు, పర్యాటక శాఖా మంత్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపునిరెడ్డి, వెంకటనారాయణ, హరినాథ్, నారాయణస్వామి పాల్గొన్నారు.



తిమ్మమాంబ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జాస్తి వీరాంజనేయులు.

సంక్షిప్త సమాచారం

బ్రహ్మ బాబా వర్ధంతి

తనకల్లు: స్థానిక ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం బ్రహ్మ కుమారి నిర్మల ఆధ్వర్యంలో బ్రహ్మ బాబా వర్ధంతి నిర్వహించారు. బ్రహ్మ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బత్తలపల్లి: మండల కేంద్రం సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రూ.24,570లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. నిందితులను ధర్మవరం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

బిగ్ బిజినెస్ డేను జయప్రదం చేద్దాం

కదిరి అర్బన్: ఈనెల 20న తలపెట్టిన బిగ్ బిజినెస్ డేను జయప్రదం చేద్దామని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కదిరి బ్రాంచ్ అధ్యక్షుడు షఫివుల్లా,ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం..అనంతపురంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలు సురేంద్ర, రమణమ్మ బైక్‌పై తలుపులకు బయలుదేరారు. బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే వారి బైక్‌ను అనంతపురానికి చెందిన చెన్నయ్య కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలను స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్ని వర్గాలను మోసగించిన ప్రభుత్వం

ముదిగుబ్బ: కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని ఏపీసీసీ అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రధాన కారణం సూపర్ సిక్స్ పథకాలేనన్నారు. తల్లికి వందనం కింద ఏడాదికి రూ.12,450 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇంత వరకూ పైసా ఇవ్వలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తామని చెప్పి రాష్ట్రంలో 53.52 లక్షల రైతు కుటుంబాలను మోసం చేశారన్నారు.

యువతి అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని వైఎస్‌ఆర్ నగర్‌కు చెందిన యువతి అదృశ్యమైంది. వివరాలు.. కాలనీకి చెందిన రామచంద్ర కుమార్తె దీక్షిత శనివారం షాపింగ్‌కని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. రామచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వ్యక్తిపై దాడి

కదిరి టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై భార్య తరపు బంధువు దాడి చేశాడు. వివరాలు..ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న హమీద్ ఆడపాలవీధిలోని రౌండ్ బిల్డింగ్ సమీపంలోని నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా హమీద్‌కు అతడి భార్యకు మనస్పర్థలున్నాయి. ఈక్రమంలో భార్య బంధువు కుమ్మరవాండ్లపల్లికి చెందిన కెఎస్ మహమ్మద్ సల్లు అనే వ్యక్తి హమీద్ ఇంటి వద్దకు వచ్చి భార్య విషయంలో గొడవకు దిగి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహమ్మద్ సల్లుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.